

20 నుంచి కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు: కలెక్టర్

పార్వతీపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, కాళ్లు లేదా చేతుల కండరాల్లో బలహీనత, తిమ్మిర్లు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్వాక్రా, మెప్మా, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతీ ఇంటిని ఏఎన్‌ఎం, వలంటీర్లు సందర్శించాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో పిల్లలకు వైద్య పరీక్షలు చేయాలని సూచించారు.

మన్యానికి పండగ కళ



'మన్యం'లో పండగ కళ తొణికిసలాడుతోంది. జిల్లా సరికొత్త శోభ సంతరించుకుంది. సంక్రాంతి సంబరాలకు జిల్లావాసులు సమాయాత్తమయ్యారు. పెద్దల పండగను మంగళవారం వైభవంగా జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తమ పూర్వీకులను పూజించి ఆపై కొత్త దుస్తులతో ముస్తాబవ్వాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఇప్పటికే చుట్టాలు, బంధువులు, స్నేహితులతో ప్రతి ఇల్లు కళకళలాడుతోంది. చిన్నారులు సందడి చేస్తున్నారు. యువకులు కేరింతలు కొడుతున్నారు. ఆటలు, పాటలతో ఆకట్టుకుంటున్నారు. మొత్తంగా అందరిలోనూ సంక్రాంతి జోష్ నెలకొంది.

గుమ్మలక్ష్మీపురంలో డూడూ బసవన్నలు ఇలా..

భోగి కాంతులు



సాలూరు రూరల్: మామిడిపల్లిలో భోగి మంటలు

జిల్లావాసులు భోగి పండగను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయాన్నే పిల్లలు, పెద్దలు వీధుల్లో భోగి మంటలు వేశారు. కొన్నిచోట్ల యువత ఆదివారం అర్ధరాత్రి నుంచే సందడి చేశారు. రాత్రంతా మేలుకుని మంటలు వేసేందుకు ఉత్సాహం చూపించారు. మరోవైపు మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల వారు, జంగందేవరలతో పల్లెలు, పట్టణాలు సందడిగా మారాయి.

శంబరకు జాతర శోభ

- పోలమాంబ తరలివచ్చిన వేళ
- చదురుగుడికి చేరుకున్న అమ్మవారు
- ఘటాలకు ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

మక్కువ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ జాతర తొలి ఘట్టానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చారు. పోలమాంబను చదురుగుడిలో కొలువుదీర్చారు. దీంతో శంబర గ్రామం జాతర శోభను సంతరించుకుంది. కాగా గోముఖీ నదీతీరాన ఉన్న అమ్మవారి గద్దె వద్ద ఘటాలకు పూజారి, కుప్పిల, గిరడ, ముస్సిపల్ కుటుంబాల వారు, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఘటాలను గ్రామంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్థులు ఘటాలను చూసి పరవశించిపోయారు. పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాలాలు, డప్పులు, వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ అమ్మవారిని సాదరంగా ఆహ్వానించారు. చదురుగుడిలో కొలువైన అమ్మవారికి 13 రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నారు. రోజూ ఘటాలకు తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం ఈ నెల 27న తొలేళ్లు , 28న సిరిమానోత్సవం, 29న అనుపోత్సవం నిర్వహిస్తారు. ఫిబ్రవరి 4న మారు జాతర నిర్వహిస్తారు. ఇలా పది వారాల పాటు జాతర కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో ఈవో సూర్య నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పోలినాయుడు, ఉప సర్పంచ్ వెంకట రమణ, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దాలినాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



అమ్మవారి ఘటాలను గ్రామంలోకి తీసుకొస్తున్న దృశ్యం

సంక్రాంతి జోష్

- సొంత గూటికి చేరిన వలస పక్షులు
- పల్లెలు, పట్టణాలు కళకళ
- సకాలంలో ధాన్యం నగదు జమ
- ఆనందంలో అన్నదాతలు
- సంప్రదాయబద్ధంగా పండగ నిర్వహణకు సర్వం సిద్ధం



బస్సు వద్ద వలస పక్షులు ఇలా..

పాలకొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దల పండగ అయిన సంక్రాంతిని కుటుంబ సభ్యులతో సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం జిల్లా వాసులకు ఆనవాయితీ. అందుకే ఏ పండగలకు రాకపోయినా విధిగా సంక్రాంతికి వస్తుంటారు. అయితే ఇప్పటికే ఎంతోమంది వలస పక్షులు సొంతగూటికి చేరుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు నిమిత్తం ఇతర దేశాలు, రాష్ట్రాల్లో స్థిరపడిన జిల్లావాసులు, ఎన్‌ఆర్‌ఐలు స్వగ్రామాలకు తరలివచ్చారు. ఉపాధి పనుల కోసం విజయవాడ, చెన్నై, నెల్లూరు, హైదరాబాద్ తదితర రాష్ట్రాలకు తరలిన జిల్లావాసులు సైతం ముందస్తుగానే స్వస్థలాలకు చేరుకున్నారు. వారం రోజుల పాటు కుటుంబ సభ్యులతో సరదాగా పండగ చేసుకుని తిరుగు ప్రయాణమయ్యేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్వగ్రామాలకు అంతా చేరుతున్న క్రమంలో రైళ్లు, బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు కిటకిటలాడుతున్నాయి. మొత్తంగా పల్లెలు, పట్టణాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. కాగా మంగళవారం ఘనంగా సంక్రాంతిని జరుపుకునేందుకు జిల్లావాసులంతా సన్నద్ధమయ్యారు.

అబుదాబీ నుంచి వచ్చా..

అబుదాబీలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నా. నాలుగు రోజు కిందటే ఇక్కడకి వచ్చా. ఏటా సంక్రాంతి పండగకు విధిగా స్వగ్రామానికి వస్తుంటా. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి ఆనందంగా పండగ జరుపుకుంటాం. నాలుగు రోజుల కిందటే అబుదాబీ నుంచి స్వగ్రామానికి చేరుకున్నాను.

– లోచర్ల హరిబాబు, ఎన్‌ఆర్‌ఐ, పాలకొండ

రైతుల్లో ఆనందం...

రైతులు తమ పంటలను విక్రయించి.. తిండి గింజలను ఇంటికి చేర్చిన తర్వాత చేసుకొనే సంప్రదాయ పండగ సంక్రాంతి. ఈ సంప్రదాయ పండగకు రైతులు ఎంతో ప్రాధాన్యమిస్తారు. పంటను సకాలంలో విక్రయించి.. నగదు చేతికి అందితేనే రైతుల మోములో ఆనందం కనిపిస్తుంది. అయితే అది ఈ ఏడాది స్పష్టంగా కనిపించింది. ప్రతి రైతుకు ముందస్తుగానే సంక్రాంతి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ మేరకు రైతులకు ఏ ఇబ్బంది లేకుండా చూసుకుంది. అంతేకాకుండా ధాన్యం విక్రయాల్లో అన్నదాతలకు స్వేచ్ఛనిచ్చింది. ధాన్యం విక్రయించిన గంటల వ్యవధిలోనే ఖాతాల్లోకి నగదు జమ చేసింది. దీంతో రైతులకు ముందుగానే పండగొచ్చింది. పెద్ద పండగకు అవసరమైన నూతన వస్త్రాలు, ఇతర నిత్యావసర సరుకులను కొనుగోలు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి సంక్రాంతిని ఘనంగా జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేశారు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో

(మిగతా 10వ పేజీలో...)

గంటల వ్యవధిలోనే నగదు జమ



ప్రభుత్వ చొరవతో రైస్‌మిల్లులకు ధాన్యం విక్రయించిన గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలకు నగదు జమ అయింది. దీంతో సంక్రాంతికి అవసరమైన నిత్యావసర సరుకులు, నూతన దుస్తులు కొనుగోలు చేసుకుని పండగకు సన్నద్ధమయ్యాం.

– పొట్నూరు జగ్గునాయుడు, రైతు, బుక్కూరు

హరిదాసులకు ఆదరణ 8లో
బైక్‌లపైనే స్వగ్రామాలకు 8లో
పర్యాటకానికి పండగ శోభ 8లో

మాజీ ఎంపీ 'పాలవలస' కన్నుమూత

- రాజకీయ ప్రస్థానమంతా కాంగ్రెస్‌లో
- 2011 నుంచి వైసీపీలో..



పాలకొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ రాజ్యసభ సభ్యుడు పాలవలస రాజశేఖరం (80) సోమవారం రాత్రి మృతి కన్నుమూశారు. శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన ఎంపీగా, ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన రాజకీయ ప్రస్థానమంతా కాంగ్రెస్ పార్టీలోనే సాగింది. 2011లో వైసీపీలో చేరారు. కాగా ఆయన సతీమణి ఇందుమతి రేగిడి జడ్పీటీసీగా ఉన్నారు. కుమారుడు విక్రాంత్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. కోడలు గౌరీపార్వతి పాలకొండ జడ్పీటీసీగా ఉన్నారు. కుమార్తె రెడ్డి శాంతి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాతపట్నం ఎమ్మెల్యేగా పనిచేశారు. రాజశేఖరం స్వగ్రామం పాలకొండ నియోజకవర్గం వీరఘట్టం మండలం నీలానగరం. ఆయన తండ్రి పాలవలస సంగం నాయుడు 1962-67 మధ్య ఉణుకూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. రాజశేఖరం ఆంధ్రా విశ్వవిద్యాలయంలో బీఎస్సీ ఆనర్స్ చేశారు. 1970-74లో నీలానగర సర్పంచ్‌గా పనిచేశారు. శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్‌గా 1974 నుంచి 1976 వరకు పనిచేశారు. 1976లో రాజ్యసభ సభ్యునిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. 1992-94 మధ్యకాలంలో డీసీసీబీ అధ్యక్షునిగా పనిచేశారు. 1994లో ఉణుకూరు శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి కిమిడి కళావెంకటరావుపై గెలుపొందారు. 1994 నుంచి 1999 వరకు శాసన సభ్యునిగా ఉన్నారు. 2006 నుంచి 2011 వరకు శ్రీకాకుళం జడ్పీ అధ్యక్షునిగా సేవలందించారు. రాజశేఖరం మృతికి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

పరీక్షలు ఉంటాయా? ఉండవా?

- ఇంటర్ మొదటి సంవత్సరంపై తల్లిదండ్రుల నుంచి అభిప్రాయ సేకరణ
- ఈ నెల 26 వరకు తంతు



విజయనగరం కలెక్టరేట్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల నిర్వహణలో సంస్కరణలు తీసుకు రావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంచాలా? వద్దా? అన్నదానిపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. ఈనెల 26 వరకూ ప్రజాభిప్రాయాలను సేకరించి తర్వాత నిర్ణయం తీసుకోనుంది. ప్రభుత్వ ప్రతిపాదనకు ఎక్కువ మంది తల్లిదండ్రులు అంగీకారం తెలిపితే 2025-26 నుంచి ప్రథమ సంవ త్సరం చదివే విద్యార్థులకు పరీక్షలు ఉండవు. ఆ మరుసటి సంవత్సరం 2026-27లో ద్వితీయ సంవత్సరం అయ్యాక పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ప్లస్-2లో రెండో ఏడాదిలోనే పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ విధానం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని, ఎక్కువ సమయం పోటీ పరీక్షలకు కేటాయించడానికి అవకాశం ఉంటుందని కొందరు అధ్యాపకులు అభిప్రాయం పడుతుండగా, ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కాస్త ఇబ్బంది ఉంటుందని మరికొంతమంది అధ్యాపకులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు పరీక్షల ముందే పుస్తకాలు తీస్తారని, అటువంటిది రెండేళ్ల పాటు పరీక్షలు ఉండవంటే వెనకబడతారని మరికొందరి భావన. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలను మార్పు చేయనుంది. కాగా కేంద్ర పరిధిలో నిర్వహిస్తున్న జేఈఈ, ఎన్‌ఐటీ, నీట్ వంటి పరీక్షలు సీబీఎస్‌ఈ ఆధారంగా జరుగుతున్నాయి. జాతీయ స్థాయిలో కేంద్రం నూతన విద్యా విధానాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేస్తోంది. అలాగే ఏపీలో కూడా వచ్చే ఏడాది నుంచి ప్రవేశపెట్టేందుకు చూస్తున్నారు.

కొత్త విధానం వల్ల ప్రశ్నపత్రంలో సంక్షిప్త ప్రశ్నలు ఎక్కువగా ఉంటాయి. నూతన విధానం వల్ల పిల్లలకు భారం తగ్గుతుందని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు లాంగ్వేజ్ సబ్జెక్టులకు ఇబ్బంది కల్గుతుందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. ఏదైనాగాని మొదటి సంవత్సర విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల రద్దుపై ఈనెల 26 వరకూ విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి అభిప్రాయం సేకరించిన తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది

వచ్చే ఏడాది నుంచి మొదటి సంవత్సరం పరీక్షలు రద్దు చేసి రెండో సంవత్సరం పెట్టడం వల్ల విద్యార్థులకు కాస్త ఒత్తిడి తగ్గుతుంది. బట్టీ పట్టే విధానం కాకుండా సంక్షిప్త ప్రశ్నలు ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల జేఈఈ, ఎన్‌ఐటీ, నీట్‌కు ఎక్కువగా ఉపయోగపడుతుంది.

– జగన్నాథం, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, గంట్యాడ


అభిప్రాయాలు సేకరిస్తున్నాం

ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణలపై ఈనెల 26 వరకూ ఆన్‌లైన్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి అభిప్రాయ సేకరణ జరుగుతోంది. ఆ తరువాత పరీక్షల రద్దుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది

– ఎం.ఆదినారాయణ, ఆర్‌ఐవో

పెద్దకేర్జిలలో ఏనుగులు

కొమరాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పెద్దఖేర్జిల గ్రామ సమీపంలో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. గత రెండు రోజులుగా పరిసర ప్రాంతాల్లో సంచరించిన ఏనుగులు సోమవారం ఆ గ్రామ సమీపంలోని జీడి తోటల్లో తిష్ఠ వేయడంతో ఈ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా సంక్రాంతి పండగ సందర్భంగా స్వగ్రామాలకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏనుగుల గుంపు రహదారికి పక్కనే ఉన్న తోటలో ఉండడంతో అవి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. తక్షణమే అటవీశాఖాధికారులు స్పందించి.. ఈ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపును తరలించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




మక్కువలో భోగిమంట వేసిన దృశ్యం


విజయనగరంలోని ఓ అపార్టుమెంట్ వద్ద..

భోగి సందడి

- జిల్లా వ్యాపంగా వేడుకలు
- ఘనంగా గోదారంగనాథుల కల్యాణం

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సోమవారం భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ప్రతిఒక్కరూ తలస్నాన మాచరించి భోగి మంట వేశారు. ముందుగా తయారుచేసిన పిడకలను భోగి మంటల్లో వేశారు. సాయంత్రం చిన్నారుల తలపై తల్లిదండ్రులు భోగి పండ్లు పోసి బాలారిష్టాలు పోయి ఆరోగ్యంగా ఉండాలని దీవించారు. అలాగే ధనుర్మాస ఉత్సవాలు ముగింపు సందర్భంగా బొబ్బిలి కంచరవీధిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, సాలూరులోని కల్యాణ వేంకటేశ్వర, పెదకోమటిపేటలోని రామాలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


బొబ్బిలి: గోదా రంగ నాథుల కల్యాణం


వీరఘట్టం: భోగి పిడకల దండను ఊరేగిస్తున్న దృశ్యం


బొబ్బిలి: కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


సాలూరు రూరల్: పెదకోమటిపేట రామాలయంలో గోదాదేవి కల్యాణం

భోగి రోజే వారికి సంక్రాంతి

- అంతకాపల్లిలో అనాదిగా వస్తోన్న ఆచారం

రాజాం రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతకాపల్లి గ్రామస్థులు భోగి పర్వదినాన సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. భోగి సందర్భంగా సోమవారం తమ ఇళ్లల్లో దేవతలకు పూజలు చేసి, పెద్దలకు నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం గ్రామ సర్పంచ్ వాకముళ్ల చిన్నంనాయుడు సారథ్యంలో గ్రామానికి చెందిన 70 కుటుంబాల వారు బ్యాండు మేళాలు, మంగళవాయిద్యాలతో గ్రామ సమీపంలోని సన్యాసమ్మ పేరంటాలు గుడికి వెళ్లి ముర్రాటలు, పసుపు కుంకుమలు సమర్పించారు. నూతన వస్త్రాలను అమ్మవారి గుడిలో పెట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిన్నంనాయుడు మాట్లాడుతూ..' తాత, ముత్తాతల కాలం నుంచి భోగి వేడుకలకు దూరంగా ఉంటున్నాం. అనాదిగా వస్తున్న ఆచారాన్ని పాటిస్తున్నాం. భోగి రోజున సంక్రాంతి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మరణించిన పెద్దలకు పూజలు చేశాక, అందరం ఒకేసారి సన్యాసమ్మ గుడికి వెళ్లి ముర్రాటలు సమర్పిస్తాం. నాటితరానికి విలువనిస్తూ సంప్రదాయాలను కొనసాగిస్తున్నాం.' అని తెలిపారు.


ముర్రాటలు, నూతన వస్త్రాలతో సన్యాసమ్మ గుడికి వెళ్తున్న గ్రామస్థులు

గిరిజనం కళ్లలో సంక్రాంతి కళ

- కూరగాయల పంటలతో ఆదాయం
- పండగ రోజుల్లో గిరాకీ


కురుపాం మార్కెట్‌కు తరలివస్తున్న అటవీ ఉత్పత్తులు


మూలిగూడ జంక్షన్‌లో కూరగాయలు అమ్ముతున్న గిరిజనులు

కురుపాం రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఉత్పత్తులకు సాధారణంగా మద్దతు ధర లభించదు. దళారులు రంగ ప్రవేశం చేసి గిరిజనులు పండించిన ఉత్ప త్తులను చౌకగా కొనుగోలు చేసి... వారు తిరిగి వాటిని అధిక ధరలకు విక్రయించి.. లాభాలు గడిస్తుంటారు. అయితే సంక్రాంతి పుణ్యమా అని గిరిజనులు పండించిన పంటలకు మార్కెట్లో మంచి గిరాకీ లభిస్తోంది. సంక్రాంతి సమయం కావడంతో వీరు పండించిన సారి కంద, పలక కంద, గుమ్మడి కాయలు, అరటి కాయలు, కందమూలం దుంపలు, పందిరి చిక్కుళ్లు, సీమ పెండ్లం, వంటి ఉత్పత్తులకు తామే స్వయంగా కురుపాం మార్కెట్‌కు తీసు కు వచ్చి మంచి ధరలకు అమ్ముతున్నారు. ప్రజ లు కూడా సేంద్రీయ పద్ధతులలో గిరిజనులు పండించిన ఉత్పత్తులు కొనటానికే ముందుకు వస్తున్నారు. మార్కెట్లో కూరగాయల వ్యాపారం చేసే వారు సాధారణంగా రసాయన ఎరువులు వేసి పండిస్తారు. గిరిజనులు రసాయన ఎరు వుల జోలికి పోరు. ఈ వ్యత్యాసం తెలిసిన ప్రజలు సేంద్రీయ కూరగాయల వైపు మొగ్గు చూపుతున్నారు. ఓడపుట్టి, కొండకూనేరు, నెల్లికిక్కువ, ప్రాంతాల్లో పండిన కూరగాయలు అధిక మొత్తంలో కురుపాం మార్కెట్‌కు వస్తు న్నాయి. దురుబిలి, మంత్రజోల, సుందరయ్య నగర్ ప్రాంతాల్లో పండిన ఉత్పత్తులను మూలిగూడ జంక్షనులో గిరిజనులే స్వయంగా అమ్ముతున్నారు. ఆ ప్రాంతంలో ప్రయాణించే వారు తమకు కావలసిన కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా కూరగాయల సాగుకు ప్రోత్సాహం లభించడం, కేవీకే, ఉద్యానవన శాఖ, ఐసీడీఎస్, జటు వంటి స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో ఇటీవల కాలంలో కూరగాయల సాగు బాగా పెరిగింది. కూరగాయలతో పాటు ఆనాస, పనస, బత్తాయి, నారింజ, బొప్పాయి, సీతాఫలం వంటి పండ్ల రకాలు ఉత్పత్తి చేసి గిరిజనులు అధిక ఆదాయం పొందుతున్నారు.

ఆదాయం వస్తోంది..



వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా వివిధ రకాల కూరగాయల విత్తనాలను సరఫరా చేస్తున్నారు. ఇటీవల పెరటి తోటల పెంపకంపై ప్రచారం బాగా జరుగుతోంది. మాలో చాలా కుటుంబాలు కేవలం కూరగాయల సాగుతోనే మంచి ఆదాయం పొందుతున్నాయి.

-పువ్వల పత్తి, గిరిజన రైతు, దురుబిలి గ్రామం

హరిదాసులకు ఆదరణ

సాలూరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం మొదలైన రోజు నుంచి పల్లెల్లో మేలుకొలుపులు, హరిదాసుల సంకీర్తనలు వినిపిస్తున్నాయి. తలపై అక్షయ పాత్రను పెట్టుకొని తంబూరాను వాయిస్తూ.. హరినామ సంకీర్తనతో సాగిపోయే వ్యక్తి హరిదాసు. తెలుగు సంస్కృ తిలో వీరు ప్రత్యేక భాగం. పట్టణ, పల్లెల్లో వీరికి ఆదరణ ఉంది. హైందవ సంప్ర దాయాన్ని పరిరక్షించే పాత్రలో హరిదాసులు నిమగ్నమై ఉంటారు. ధనుర్మాసం ఆరంభం నుంచి సంక్రాంతి వరకు నెల రోజుల పాటు వేకువ జాము నుంచి వీరి మేల్కొలుపు, సంకీర్తనలు సాగుతాయి. కాలం ఎంత మారుతున్నా... హరిదాసులకు పల్లెల్లో ఆదరణ తగ్గడం లేదు. నుదుటపై తిరునామం దిద్దుకుంటారు. తలపై అక్షయ పాత్ర ఉన్నంత వరకు ఎవరితోనూ మాట్లాడరు. అక్షయ పాత్ర ఎక్కడ నిండితే...అక్కడ ఎదురుగా ఉన్న ఇంటిలో స్వీకరించిన బియ్యం, ధనం భద్రపరుస్తారు. సంక్రాంతి తరువాత వాటిని స్వీకరించి కొంతభాగం భద్రాచలం తీసుకెళతారు. వీరికి ఆదరణ తగ్గకుండా ప్రస్తుత తరం చూసుకోవాలని పెద్దలు సూచిస్తున్నారు. మన సంప్రదాయ, ఆచారాలను పరిరక్షించడానికి జానపద కళాకారులను ప్రజలు ప్రోత్సహించాలని సనాతన ధర్మపరిషత్ సారథి సుబ్బ గురువు, అధ్యక్షుడు కొలకోటి శంకరరావు పిలుపునిచ్చారు.


సాలూరు రూరల్: సాలూరులో సంకీర్తనలు పాడుతున్న హరిదాసు


బండలాగుతున్న ఎడ్లు

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

బాడంగి/బొబ్బిలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా బాడంగి మండలం గజరాయునివలసలో సోమవారం ఎడ్లతో బండలాగుడు పోటీలను నిర్వహించారు. బుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్ జేసీ రాజు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. సుమారు 800 కిలోల బరువు కలిగిన బండ ను లాగేందుకు వివిధ గ్రామాల నుంచి 20 ఎడ్ల జతలతో రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన జాడ దాలయ్య ఎడ్లు విజేతగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో చెముడు గ్రామానికి చెందిన నగిరెడ్డి త్రినాథ ఎడ్లు, తృతీయ స్థానంలో తెర్లాం మండలం లోచర్ల గ్రామానికి చెందిన వెలగల వెంకటరమణ నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను అందజే శారు. బొబ్బిలి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు, బొబ్బిలి మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడరు గెంబలి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ మూడడ్ల సత్యం, యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

భోగికి దూరంగా రావుపల్లి

గరుగుబిల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుపల్లి గ్రామస్థులు భోగిని జరుపుకోలేదు. కొన్నేళ్ల కిందట భోగి పండగ రోజు గ్రామస్థులు వేసిన మంటలో ఎద్దు (అచ్చు కోడి) పడి దహనమైంది. ఎద్దును సింహాద్రి అప్పన్నకు కానుకగా ఇచ్చిన సమయంలోనే ఈ ఘటన జరిగింది. అప్పటి నుంచి గ్రామస్థులు ఈ పండగకు దూరంగా ఉంటున్నారు.

రావుపల్లి గ్రామం ఇదే →



పర్యాటకానికి పండగ శోభ

సీతంపేట రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలోని పర్యాటక ప్రాంతాలకు సంక్రాంతి శోభ వచ్చింది. భోగి సందర్భంగా సోమవారం పర్యాటకులు ఆడలీ వ్యూ పాయింట్, మెట్టుగూడ జలపాతం, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో సందడి చేశారు. ఆడలీ వ్యూ పాయింట్ నుంచి దిగువన అందాలను తిలకించారు. ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లోని షూటింగ్, స్కై సైక్లింగ్, బుల్‌రైడ్, కిడ్స్ స్విమ్మింగ్ పూల్, బోటింగ్, కాయకింగ్, 5 డీ థియేటర్, క్లయింబింగ్ వాల్, గైరో తదితర వాటిని ఎంజాయ్ చేశారు. మెట్టుగూడ జలపాతం వద్ద నీరు తక్కువగా వస్తుండడంతో స్నానాలు ఆచరించేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరచలేదు. పర్యాటకుల తాకిడి సంక్రాంతి, కనుమ రోజుల్లో మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.


హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న విద్యార్థినులు



భోగాపురం వద్ద హైవే మీదుగా కుటుంబాలతో కలిసి ద్విచక్ర వాహనాలపై శ్రీకాకుళం వైపు వెళ్తున్న దృశ్యం


బైక్‌లపైనే స్వగ్రామాలకు..

- వందల కిలోమీటర్లు ప్రయాణం
- సంక్రాంతి కోసం ఇంటికి వచ్చేందుకు వలసపక్షుల పాట్లు

భోగాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కోసం తమ స్వగ్రామాలకు చేరుకునేందుకు వలసవాసులు తీవ్ర పాట్లు పడుతున్నారు. భార్యాపిల్లలతో కలిసి ద్విచక్ర వాహనాలపై వందల కిలో మీటర్లు ప్రయాణించి ఇళ్లకు చేరుకుంటున్నారు. సంక్రాంతి నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు, రైళ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రైవేటు బస్సులను ఆశ్రయిద్దామంటే డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో వలసదారులు బైక్‌లపైనే సొంతూళ్లకు చేరుకుంటున్నారు. రాజమండ్రి, సామర్లకోట, మల్లివరం, నరసన్నపేట రోడ్, తుని, అనకాపల్లి, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి అనేక కుటుంబాలు బైక్‌లపై శ్రీకాకుళం వైపు సోమవారం ప్రయాణం సాగించారు. మధ్యమధ్యలో సేదతీరుతూ మరలా ప్రయాణం సాగిస్తున్నారు. చంటిపిల్లలు, బాలింతలు సైతం ద్విచక్ర వాహనాలపైనే వెళ్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

నిర్వహణ లేక.. మరమ్మతులు చేయక

● రక్షణ గోడలు లేవు ● హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు నోచుకోని వైనం ● ఇదీ సంతకవిటి మండలంలోని వంతెనల పరిస్థితి



వాసుదేవపట్నం వద్ద సాయన్న గెడ్డపై వంతెనకు రెయిలింగ్ లేని దృశ్యం

సంతకవిటి,జనవరి 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు వంతెనలు నిర్వహణ లేక ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా వంతెనల వద్ద రెయిలింగ్, రక్షణ గోడలు పాడయ్యాయి. దీంతో ఏమరపాటున ఉన్న సమయంలో, చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించేవాహనాలు ప్రమదానికి గురయ్యే అవకాశముంది. ఈనేపథ్యంలో ఆయా చోట్ల హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటుచేయలేదు. వంతెనకు ఇరువైపుల ఏర్పాటు చేసిన గోడలు పూర్తిగా పాడవడంతో వేగంగా వచ్చే వాహనాలు కాలువల్లోకి దూసుకువెళ్లే ప్రమాదముందని పలువురు వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. వంతెనలు నిర్మించి మూడు దశాబ్దాలు దాటతున్నా కనీస మరమ్మతులు లేకపోవడంతో ఏ క్షణంలో కూలిపోతాయోనని భీతిల్లుతున్నారు. సంతకవిటి-హోంజరాం ప్రధానరహదారిలో వాసుదేవపట్నం వద్ద నారాయణపురం కుడికాలువపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకుచేరింది. వంతెనపై భాగంలో రక్షణగోడ కూడాలేదు. దీంతో పైభాగంలో రక్షణ గోడలేదు. ఇదే ప్రాంతంలో ప్రమాదకరంగా రోడ్డు మలుపు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళనకు గురవుతున్నారు.మల్లయ్యపేట వద్ద నారాయణపురం కుడికాలువపై ఉన్న బ్రిడ్జి, రామారాయపురం వద్ద సాయన్నచానల్పై ఉన్న బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులకైనా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మల్లయ్యపేట వద్ద రక్షణగోడ కూలిపోవడంతో ప్రమాదకరంగా ఉన్న వంతెన



నెల్లిమర్ల: గోదాదేవి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



గరుగుబిల్లి: తోటపల్లి ఆలయ ప్రాంగణంలో...



శృంగవరపుకోట రూరల్: కొట్టాంలో

అంగరంగ వైభవంగా గోదాదేవి కల్యాణం

ఉమ్మడి జిల్లాలోని రామతీర్థం రామస్వామి, గరుగుబిల్లి మండలంలోని తోటపల్లిలోగల వేంకటేశ్వరస్వామి,కోదండరామస్వామి దేవస్థానాలతోపాటు పలుచోట్ల గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా సోమవారం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా ధనుర్మాసోత్సవాలు ముగిశాయి.

●నెల్లిమర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో గోదాదేవి కళ్యాణోత్సవాన్ని దేవస్థానం అర్చకులు నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని 30 రోజులుగా గోదాదేవి తన మనసులో కృష్ణభగవానుడుని కొలుస్తూ రోజుకో పాశురాన్ని గానం చేస్తూ తిరుప్పావై వ్రతాన్ని చేసిందని, భోగి నాడు గోదాదేవి శ్రీకృష్ణ పరమాత్మలో వివాహం చేసుకుని లీనమవుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి సాయిరామాచార్యులు వివరించారు. ఈక్రమంలో సోమవారం ఉదయం ప్రాతఃకాలార్చన, తిరుప్పావైసేవా కాలం, బాలభోగం నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారిని ఊరేగించి, ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో స్నానం చేయించారు. గోదాదేవి అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించి శ్రీకృష్ణ పరమాత్మతో కల్యాణోత్సవం నిర్వహించారు. తర్వాత యాగశాలలో సుందరకాండహవనం, సుదర్శన అష్టకహ వనం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో వైశ్రీనివాసరావు పర్యవేక్షించగా, అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, ఖండవిల్లి కిరణ్కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పవన్కుమార్, పాణంగిపల్లి ప్రసాద్ తదితరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు

●గరుగుబిల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి):తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవస్థానాల్లో ధనుర్మాస ఉత్సవాలు ముగిశాయి. ఇక్కడ గతనెల 16 నుంచి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. సోమవారం ఈవో వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణాన్ని ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు నిర్వహించారు. స్వామివారికి మొక్కులను చెల్లించారు. తలనీలాలను అర్పించారు.

● శృంగవరపుకోట రూరల్, జనవరి13 (ఆంధ్రజ్యోతి):కొట్టాం గోస్తనీ నదితీరంలో గోదాదేవికల్యాణం ధర్మకర్తలు సేనాపతిచంద్రరావు,బాలసన్యాసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గోస్తనీ తీరం కొండపై కొలువుదీరిన విష్ణు ఆలయం నుంచి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు.

16న అప్రెంటిస్ మేళా

విజయనగరం రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 16న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి ఒక ప్రకటనలో తెలిపారు.అప్రెంటిస్ మేళాలో దేశం,రాష్ట్రంలో పేరు, ప్రఖ్యాతలు గల పలు కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం తొమ్మిదిగంటలకు మేళా ప్రారంభమవుతుంద పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆధార్కార్డు, రెండు ఫొటోలతో పాటు హాజరుకావాలని, వివరాలకు 9849118075, 9849944654 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బకాయిల చెల్లింపు

డెంకాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఐదో పోలీస్బెటాలియన్ ఉద్యోగులకు ఏడాది నుంచి పెండింగ్లో ఉన్న అడిషినల్ సరండర్ లీవ్ బకాయిలు, జూన్ వరకు సప్లిమెంటరీ సరెండర్ లీవ్లు, జీపీఎఫ్, సీపీఎఫ్, పోలీస్ ఉద్యోగుల బకాయిలను మంజూరు చేసేలా సీఎంచంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారని ఐదో పోలీస్ బెటాలియన్ పోలీస్ అధికారుల సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు అధికారుల సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు, రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు హర్షం వ్యక్తం చేశారు.

భవానీ శంకర స్వామికి అన్నాభిషేకం



విజయనగరం రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరం సిటీబస్స్టాండ్లోని కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలోగల భవానీశంకర స్వామికి సోమవారం పౌర్ణమి ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గాయత్రీశర్మ ఆధ్వర్యంలో పురోహితులు ప్రత్యేక పూజలుచేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



స్తంభం అడుగుభాగంలో దెబ్బతిన్న దృశ్యం

జామి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరంలో పాల కేంద్రం సమీపంలో విద్యుత్ స్తంభం అడుగు భాగం దెబ్బతిని ఇనుప ఊచలు కనిపిస్తున్నాయి. మూడు నెలలుగా స్తంభం పట్టుకోల్పోవడంతో ఏ క్షణంలో కూలిపోతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం పొంచిఉందని ట్రాన్స్కో అధికారులు, లైన్మెన్కు స్తంభం దుస్థితిని తెలియజేస్తున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. కాగా జాగరంలోని స్తంభానికి ఏవరో వాహనంతో ఢీకొని వెళ్లిపోవడంతో దెబ్బతిందని ఏఈ జ్యోతిష్యరావు తెలిపారు. ఈ విషయంపై విచారణ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమస్య పరిష్కరించాల్సిఉందని చెప్పారు.



భోగాపురం:కిటకిటలాడుతున్న సవరవల్లి సంత



చీపురుపల్లి: మార్కెట్లో కూరగాయలు కొనుగోలుచేస్తున్న వినియోగదారులు

మార్కెట్కు సంక్రాంతి కళ

● సంతలకు పోటెత్తిన క్రయవిక్రయదారులు ●పొట్టేళ్లు, కోళ్లకి గిరాకీ

ఉమ్మడి జిల్లాల్లోని విజయనగరం, రాజాం, చీపురుపల్లి, పార్వతీపురం, పాలకొండ, సాలూరు తదితర ప్రధాన పట్టణాల్లోని మార్కెట్లల్లో, పలు సంతల్లో సోమవారం సంక్రాంతి కళ కనిపించింది. సంక్రాంతికి అవసరమైన సరుకులు, కూరగాయలు, పొట్టేళ్లు, కోళ్ల కొనుగోలుకు తరలివచ్చారు. పొట్టేళ్లు, నాటు కోళ్లకు గిరాకీ పెరిగింది.

భోగాపురం, జనవరి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సవరవల్లి సమీపంలో గల జాతీయరహదారిపక్కన సోమవారం నిర్వహించిన సంతలో సంక్రాంతి సందడి నెలకొంది.జిల్లాలోని పలుప్రాంతాల్లో క్రయవిక్రయదారులతో కిటకిటలాడింది. ప్రధానంగా పొట్టేళ్లు, నాటుకోళ్లకి గిరాకీ పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ధరలు పెంచేశారని వినియోగదారులు వాపోయారు.మంగళవారంసంక్రాంతికావడంతో ఇక్కడకు సవరవల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వారు కూరగాయాలు, కోళ్లు, మేకలు, గొర్రెలు కొనుగోలుచేశారు. అయితే సొంతకు వచ్చే క్రయవిక్రయదారుల నుంచి ఆటోవాలాలు అధిక చార్జీలువసూలుచేశారని పలువురు వాపోయారు.

●చీపురుపల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి):చీపురుపల్లిలో రోడ్లన్నీ కిటకిటలాడాయి. బట్టలు, కూరగాయలు కొనుగోలుకు రావడంతో జన సంద్రంలా మారిపోయాయి.

దళితుల అభ్యున్నతికి కృషి

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



రాజాం: అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో దళితుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నట్లు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. సోమవారం గురవాంలో అంబేద్కర్విగ్రహన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం దళితుల నడ్డి విరిచి 27 పథకాలను రద్దు చేసి దగాచేసిందని ఆరోపించారు. వైసీపీ రద్దుచేసిన 27 పథకాలను చంద్రబాబు త్వరలో తిరిగి పునః ప్రారంభిస్తారన్నారు. రాజాం మాదిగవీధికి చెందిన ఓ చిన్నారి అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రి చికిత్స నిమిత్తం తండి ఇలపండు అజయ్కుమార్కు లక్ష ఆరువేల 127 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్ల అప్పలనాయుడు, కోండ్రు జగదీష్, గట్టి భాను, సుమల మన్మథరావు, పిన్నింటి మోహన్రావు, దూబ ధర్మారావు, దుప్పలపూడి శ్రీను, పొన్నాడ భీమేశ్వరరావు, కోటగిరి నారాయణరావు, పర్లాపు పోలిరాజు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి ధ్యేయం

సంతకవిటి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్, కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దసిరిపురం యాతవీధి నుంచి చిన్న సిరిపురం సెల్టవర్ వరకు నిర్మించిన సీసీరోడ్డునుప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్ల అప్పలనాయుడు, గణేష్, గట్టి భాను, నారాయణప్పుడు, శ్రీనివాస్, చెలికాని మహేష్బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో రంగువల్లుల పోటీలు

వేపాడ జనవరి 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని జగ్గయ్యపేటలో సంక్రాంతి పురస్కరించుకొని రామాలయం వద్ద గ్రామానికి చెందిన హరిబాబు ఆధ్వర్యంలో రంగువల్లుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మహిళలకు పూల మొక్కలను బహుమతులు అందజేశారు.

చింతపల్లిలో జెట్టీ ఏర్పాటుచేయాలి

● డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ను కలిసిన జనసేన నాయకులు



పవన్కల్యాణ్కు సమస్యలు వివరిస్తున్న జనసేన నాయకులు

పూసపాటిరేగ, జనవరి13(ఆంధ్రజ్యోతి): చింతపల్లిలో జెట్టీ ఏర్పాటు చేస్తే మత్స్యకారులకు మేలు జరుగుతుందని జనసేన నాయకులు తెలిపారు. మంగళగిరిలో జనసేన నాయకుడు లోకం ప్రసాద్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ను కలిసి నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తారక రామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. విశాఖ నుంచి భీమిలి వరకూ గల బీచ్ రోడ్డును చింతపల్లి వరకూ విస్తరిస్తే కోస్టల్ కారిడార్ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోట్ల రఘు, బాల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్మారక కేంద్రాలు ఏర్పాటుచేయాలి

లక్కవరపుకోట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన రచయిత, సాహితీవేత్త కిలారి గౌరినాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్కు శేషేంద్రజాలం సంకలనం గ్రంథాన్ని బహూకరించారు. పల్లెపండుగ సందర్భంగా పిఠాపురంలో ఆయనకు గుంటూరు శేషేంద్రశర్మ రచించిన గ్రంథాన్ని అందజేశారు.ఎ.సోమసుందర్, రాచకొండ విశ్వనాథశాస్త్రి స్మారక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన్ను కోరగా సుముఖత వ్యక్తం చేశారని గౌరినాయుడు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రాజాం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాజాంలోని డోలపేటజడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-2000 బ్యాచ్కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వారంతా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

●డెంకాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి):డెంకాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 2003-04 సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు శ్రీరామమూర్తి రాజు, వెంక టాచారి, రొంగలి కృష్ణ, ఉపాధ్యాయులు త్రినాథ్, హెచ్ఎం కృష్ణమూర్తి నాయుడును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, సిరపురపు నాయుడు, రొంగలి లక్ష్మి, రమణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



రాజాం: డోలపేటలో కలుసుకున్న 1995-2000 బ్యాచ్ విద్యార్థులు



డెంకాడ: ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చికిత్సపొందుతూ వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తులు చికిత్సపొందుతూ శనివారం మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

పోతనాపల్లికి చెందిన ఒకరు..

శృంగవరపుకోట రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనాపల్లికి చెందిన ప్రకాష్(60) చికిత్సపొందుతూ మృతి చెందాడు. సీఐ నారాయణమూర్తి కథనం మేరకు.. పోతనాపల్లికి చెందిన ఎర్రయ్య ఆదివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై సీతంపేట నుంచి గ్రామానికి వస్తున్నాడు. ఇదే సమయంలో అదేగ్రామానికి చెందిన ప్రకాష్(60)రోడ్డుదాటుతుండగా ఎర్రయ్య తన వాహనంతో ఢీకొట్టాడు. దీంతో గాయపడిన ప్రకాష్ను ఎస్.కోట సీహెచ్సీకి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్కు రిఫర్చేశారు. అక్కడ చికిత్స పొందుతు సోమవారం వేకువజామున మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

కాలిన గాయాలతో వృద్ధురాలు..

గంట్యాడ,జనవరి13(ఆంధ్రజ్యోతి):కాలినగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు సోమవారం మృతిచెందింది. ఎస్ఐ సాయి కృష్ణ కథనం మేరకు.. రామవరం గ్రామానికి చెందిన పూడి గౌరమ్మ (80) ఈనెల ఆరో తేదీ రాత్రి నిద్రిస్తున్న సమయంలో చలికి అగ్ని కుంపటి మంచం కింద పెట్టుకుంది. అర్ధరాత్రి వాష్రూముకు వెళ్లింది. తిరిగి నిద్రించడానికి వస్తుండగా అగ్ని కుంపటిపై కూర్చోవడంతో గాయపడింది. దీంతో చికిత్సనిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

చెరువులో పడి ఒకరు మృతి

లక్కవరపుకోట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లివీడు గ్రామానికి చెందిన వీరనాగా పాత్రుడు(42) చెరువులో దిగి మృతి చెందినట్లు సమాచారం అందిందని హెచ్సీ పాపారావు తెలిపారు. పాత్రుడు బహిర్భూమికి వెళ్లి చిలకవానిచెరువులో జారిపడిపోయాడన్న అనుమానం గ్రామస్థులు వ్యక్తం చేసినట్లు చెప్పారు.ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గంట్యాడ,జనవరి13(ఆంధ్రజ్యోతి):మండలంలోనిరామవరంసమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఎస్ఐ సాయి కృష్ణ కథనం మేరకు.. రామవరం గ్రామానికి చెందిన పి.వాసు విజయనగరం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో వాసుతోపాటు ఆటోలో ఉన్న మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదుచేశారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి..

లక్కవరపుకోట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మాదేవిపేట జంక్షన్ వద్ద సోమవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారని హెచ్సీ పాపారావు తెలిపారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. గాయపడిన ఇద్దరిని చికిత్సకోసం కొత్తవలస, ఎస్.కోట తరలించామని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. రంగారాయపురం వద్ద మరో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో అగ్గిరాముడు గాయపడ్డాడని తెలిపారు.చికిత్సకోసం ఎస్.కోట సీహెచ్సీకి తరలించామని హెచ్సీ పాపారావు చెప్పారు.

ఆరు లీటర్ల సారా స్వాధీనం

లక్కవరపుకోట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగ గ్రామంలో ఆరు లీటర్ల సారా సోమవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నవీన్పడాల్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి కక్కల గంగను అరెస్టు చేశామని చెప్పారు.

16న కనకదుర్గమ్మ తీర్థమహోత్సవం



గంట్యాడ: ఆలయం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న పోలీసులు

గంట్యాడ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కొటారుబిల్లి కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం ఈనెల 16న జరగనుంది. ఈనేపథ్యంలో సోమవారం విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ సాయికృష్ణ ఆలయం వద్దకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయం నిర్వాహకులు వేమలి ముత్యాలు నాయుడును తీర్థ మహోత్సవం ఏర్పాట్లపై అడిగితెలుసుకున్నారు.తీర్థమహోత్సవానికి ఎంత మందివస్తారు, ఇక్కడకి వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా నిర్వహణ, వాహనాలు పార్కింగ్పై నిర్వాహకులతో చర్చించారు. భక్తులు ఇబ్బంది కల్గకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ నిర్వాహకులు పోలీసులను కోరారు.


రేపు కృష్ణరాయుడుపేటలో ..

వేపాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణరాయుడుపేట, గుడివాడ కొండగుళ్ల తీర్థంలో కనుమ పురస్కరించుకుని బుధవారం తీర్థ మహోత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లుచేస్తున్నారు. కోడి పందేలు, ఎడ్ల పరుగు ప్రదర్శనలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్శాఖ హెచ్చరిస్తున్నా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తుండడం విశేషం.

షటిల్ బ్యాడ్మింటన్ రన్నర్గా అలుగోలు

నెల్లిమర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగోలు జట్టు షటిల్ బ్యాడ్మింటన్ రన్నర్గా నిలిచింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని అలుగోలులో కడగల తమ్మినాయుడు స్మారక జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు.ఈమేరకు శ్రీకాకుళం జిల్లా రణస్థలం జట్టు విజేతగా నిలవగా అలుగోలు రన్నర్గా, తృతీయ స్థానాన్ని విజయనగరం జట్టు గెలుచుకుంది.ఈసందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు కడగల ఆనంద్కుమార్ విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురిమినేని దివాకర్, కెల్ల నారాయణప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాసరావు

రాజాం రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణానికి చెందిన సంఘ సేవకుడు, అరుణోదయ విద్యాసంస్థల నిర్వాహకుడు గర్లంకి శ్రీనివాసరావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. సామాజికసేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు 20 ఏళ్లుగా విద్యాసంస్థల నిర్వహణ, కరోనా సమయంలో రెండేళ్లపాటు అందించిన సేవలకు గుర్తించి చెన్నైకి చెందిన గ్లోబల్ పీస్ యూనివర్సిటీ ఫోరిడా డాక్టరేట్కు ఎంపికచేసింది. ఈమేరకు ఈనెల 11న చెన్నైలోని రాజా అన్నామలైభవన్లో నిర్వహించిన స్నాతకోత్సవంలో శ్రీలంక ప్రొవిన్షియల్ గవర్నర్ సిరిల్ సిదువల్ల, యూనివర్సిటీ వైస్ చాన్స్లర్ వెంకటేశం, వర్సిటీ ఛైర్మన్ గౌరవ డాక్టరేట్ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టరేట్ నామినేషన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ సుకుమార్తో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారని గర్లంకి శ్రీనివాసరావు తెలిపారు.

ఆలయానికి ప్లేట్లు బహూకరణ

నెల్లిమర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం అన్నదాన సత్రంలో వినియోగానికి హైదరాబాద్కు చెందిన ఎస్టీపీ సతీష్ సుమిత్ర దంపతులు 50 చొప్పున స్టీలు పళ్లాలు, గ్లాసులను కార్యాలయ సిబ్బందికి సోమవారం బహూకరించారు. ఎస్టీపీ రంగాచార్యులు, జి.అనంతాచార్యులు, జి.పద్మనాభాచార్యుల స్మారకార్థం అందజేసినట్లు వారు తెలిపారు.

సంక్రాంతి జోష్

(ఏడో పేజీ తరువాయి)

నెలల తరబడి ధాన్యం నగదు అందక తీవ్ర ఇబ్బందులు పడేవారు. అప్పులు చేసుకుని పండగ చేసుకునే పరిస్థితి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన అధికారంలోకి వచ్చిన ఆ ఇబ్బందులు తొలగిపోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు మేలు..



ప్రభుత్వ నిర్ణయంతో ఈ ఏడాది రైతులకు ఎంతో మేలు జరిగింది. ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు తరలించి వెనువెంటనే ఖాతాల్లో నగదు జమ చేసింది. దీంతో ముందస్తుగానే సం క్రాంతి సంబరాలు జరుపుకున్నట్లయ్యింది.

-గోగులు శేఖర్, రైతు , పాలకొండ

ఏటా స్వగ్రామంలోనే సంబరాలు



హైదరాబాద్‌లోనే 25 ఏళ్లుగా ఉంటున్నా. అక్కడే చిరు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాం. అయితే ఏటా సంక్రాంతికి మాత్రం స్వగ్రామానికి వస్తాం. కుటుంబ సభ్యులతో కలిసి స్వగృహంలో సంప్రదాయబద్ధంగా పండగ జరుపుకుంటాం. పెద్ద పండగను సొంతూరిలో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

- పొట్నూరు అచ్యుతరావు, చిరు వ్యాపారి, బుక్కూరు

టిఫిన్ దుకాణం దగ్ధం

- సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం



దుకాణంలో ఎగసిపడుతున్న మంటలు

సీతంపేట రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామంలో వారపు సంత ఆవరణలో ఉన్న గొర్లె ప్రకాశరావుకు చెందిన టిఫిన్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం రాత్రి ఉన్నట్టుండి ఒక్కసారిగా దుకాణంలో మంటలు చెలరేగినట్లు బాధితుడు తెలిపాడు. మంటలను అదుపు చేసేందుకు ఎంత మంది ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఉవ్వెత్తున మంటలు ఎగసిపడడంతో అదుపు చేసేందుకు ఎవరూ వెళ్లే సాహసం చేయలేకపోయారు. మరో పక్క గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకోవడంతో చుట్టుపక్కల వాళ్లు పరుగులు తీశారు. ఈ అగ్నిప్రమాదంలో దుకాణంలో ఉన్న ద్విచక్ర వాహనం, ఫ్రిజ్, మంచం, గ్యాస్‌స్టవ్, గ్యాస్ సిలండర్, గ్రైండ ర్లు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న పాలకొండ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను కొంత వరకు అదుపుచేశారు. సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం ఉంటుందని పాలకొండ ఫైర్‌స్టేషన్ అధికారి జామి సర్వేశ్వరరావు చెప్పారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.

వాటర్ ప్లాంట్ వితరణ

మక్కువ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటభైరిపురం గ్రామానికి ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు రూ.3లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారు. ఈ మినరల్ వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ ఎం.వెంకటరత్నం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు తోపాటు యువసేన సభ్యులు పాల్గొన్నారు.

జంఝావతికి జల హారతి

కొమరాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జంఝావతి నదికి జల హారతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి కన్వీనర్ మరిశర్ల మాలతి కృష్ణమూర్తినాయుడు ఆధ్వర్యంలో జంఝావతి రబ్బరు డ్యాం సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదే దశాబ్దాలుగా జంఝావతి ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరువుల పరిరక్షణ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీకి సంక్రాంతి శుభాకాంక్షలు



ఎంపీ కలిశెట్టికి పెండ్లం అందజేస్తున్న పార్టీ నాయకులు

సీతంపేట రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడిని టీడీపీ మండల అధ్యక్షుడు సవరతోట మొఖలింగం సోమవారం శ్రీకాకుళం జిల్లా రణస్థలంలోని ఆయన స్వగృహంలో గౌరవ పూర్వకంగా కలిశారు. ఈ మేరకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజన ప్రాంతంలో లభించే పెండ్లం, గుమ్మడికాయ, కందికాయలను ఆయనకు అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో కూర్మారావు, వెలుగు సంజీవరావు ఉన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి పరామర్శ

మక్కువ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ద్విచక్ర వాహనం అదుపుతప్పి గాయపడిన టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల నాయుడును జనసేన సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ పరామర్శించారు. సోమవారం ఏ.వెంకంపేటలోని ఆయన స్వగృహంలో కలిశారు. జనసేన మక్కువ మండల ఉపాధ్యక్షుడు వెంపడాపు సుగుణేశ్వరరావు, బీసీ సెల్ కో-ఆర్డినేటర్ బోను పాపారావు, సాలాపు చిరంజీవి, తిరుపతి తదితరులు ఉన్నారు.

తోటపల్లి ఆలయ అభివృద్ధికి విరాళాలు

గరుగుబిల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధి గాంచిన తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవస్థానాల అభివృద్ధికి పలువురు దాతలు ముందుకు వస్తున్నారని ఆలయ అభివృద్ధి సేవా ట్రస్టు ప్రధాన కార్యదర్శి డా.డి.పారినాయుడు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రోత్సాహంతో పలువురు అభివృద్ధికి చొరవ చూపుతున్నారన్నారు. శంకా కనకరాజు దంపతులు లక్ష రూపాయలు, ఎం.సీతంనాయుడు కుటుంబ సభ్యులు కిరణ్, ప్రవీణ్‌లు రూ.50వేలు, పార్వతీపురం వైద్యుడు నాని రూ.1.50లక్షలు, కె.సూర్య వైష్ణవి రూ.లక్ష, టీడీపీ నాయకుడు డొంకాడ రామకృష్ణ లక్ష రూపాయలు, ఏలూరు సత్తిబాబు (నందివానివలస) రూ.లక్ష అందించారన్నారు. ఆలయ అనువంశిక సభ్యులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మర్రాపు పురుసోత్తంనాయుడు, డొంకాడ చిన్నమ్మలు, ఎం.రామకృష్ణ, కె.అప్పలాచార్యులు, మరడాన సింహాచలంనాయుడు, గౌరీశంకరబాల, జి.సతీశ్వరరావుతో పాటు పలువురు సభ్యత్వాలను తీసుకున్నారని ఆయన తెలిపారు.

కోలాటం బృందానికి దుస్తుల పంపిణీ

గరుగుబిల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రావుపల్లి గ్రామంలో కోలాట బృందం సభ్యులకు టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్ కుమార్ సోమవారం కోలాట ప్రదర్శనకు అవసరమైన సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు సీహెచ్ ధామోధర్‌నాయుడు, జి.నాగరాజు ఉన్నారు.

ఆనందోత్సాహాలతో..

- ఘనంగా భోగి పండగ
- గ్రామాల్లో సందడే సందడి
- క్రీడా పోటీల నిర్వహణ
- గంగిరెద్దుల విన్యాసాలు

భోగి పండగను పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లో వేకువజామున సంప్రదాయబద్ధంగా భోగి మంటను వేశారు. చిన్నారులు, పెద్దలు, యువకులు అందరూ మంట చుట్టూ చేరి సందడి చేశారు. తాము తీసుకొచ్చిన పిడకల దండలను మంటల్లో వేశారు. సాయంత్రం చిన్నపిల్లలపై భోగి పళ్లు పోసే కార్యక్రమం నిర్వహించారు. పలుచోట్ల క్రీడా పోటీలు నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



భామిని: భోగి మంట వద్ద గ్రామస్థులు



సీతానగరం: భోగి మంట వద్ద మేలుకొలుపు బృందం



పాలకొండలో భోగి మంట వద్దకు చేరిన పట్టణవాసులు



కురుపాం రూరల్: భోగి మంట వద్ద మొక్కుతున్న స్థానికులు



పార్వతీపురం/టౌన్: పట్టణ ప్రధాన రహదారిలో..

కిటకిటలాడిన పట్టణాలు

పార్వతీపురంటౌన్, సాలూరు రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పండగ నేపథ్యంలో పట్టణాల్లో దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు గ్రామీణ ప్రాం తాల నుంచి అధిక సంఖ్యలో రావడంతో రద్దీ నెలకొంది. షాపులన్నీ కిటకిటలాడాయి. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ స్తంభించింది.



పార్వతీపురం టౌన్: జనాలతో రద్దీగా ఉన్న ప్రధాన రహదారి



సాలూరు: ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాల్లో క్రీడా పోటీలు

సాలూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భోగి పండగ నేపథ్యంలో జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పనసకు పెరిగిన గిరాకీ

- కిలో రూ.25 పలుకుతున్న ధర
- గిరిజనులకు ఆశించిన ఆదాయం



వారపుసంతకు పుష్కలంగా వచ్చిన పనస కాయలు

సీతంపేట రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తుల్లో ఒకటైన పనసకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఈ పనస కాయలు ఎక్కువగా ఒడిశా ప్రాంతానికి ఇక్కడి నుంచి ఎగుమతి అవుతాయి. భువనేశ్వర్, కటక్, పూరి, బరంపూర్ వంటి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సీతంపేట ఏజెన్సీలో జరిగే వారపు సంతల్లో వీటిని కొనుగోలు చేసి తరలిస్తుంటారు. ఈ పనస కాయలతో ఒడిశావాసులు ఎక్కువగా బిర్యానీ, కూరల్లో వినియోగిస్తారు. ఈ సీజన్‌లో సీతంపేట ఏజెన్సీలోని వారపు సంతలైన సీతంపేట, కుసిమి, దోనుబాయి, పూతికవలస, మర్రిపాడు సంతలకు ఈ పనసను ఎక్కువగా గిరిజనులు తీసుకువస్తున్నారు. పనసకాయలను కిలో రూ.25కు వ్యాపారులు గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. గతంలో అయితే రూ.20 పలికే ఈ పనసకాయల ధర నేడు కేజీ రూ.25 పులకుతోంది. దీంతో గిరిజన రైతులు ఆర్థికంగా లాభం పొందుతున్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న ఎమ్మెల్యే దంపతులు

పార్వతీపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఆయన సతీమణి అనూష టీడీపీ జీవితకాల సభ్యత్వం తీసుకున్నారు. ఒక్కొక్కరు లక్ష రూపాయలు చెల్లించి పార్టీ జీవితకాల సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి మాట్లాడుతూ ఒక విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అన్నారు.



సభ్యత్వం తీసుకున్నట్టు చూపిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర దంపతులు

కోడి రామ్మూర్తికి నివాళి

- వీరఘట్టంలో మల్ల యోధుడి వర్ధంతి

వీరఘట్టం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మల్ల యోధుడు కోడి రామ్మూర్తినాయుడు వర్ధంతి సందర్భంగా సోమవారం వీరఘట్టంలోని తెలగ వీధిలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రామ్మూర్తి వీరఘట్టం పేరు ప్రతిష్ఠలను ప్రపంచ నలుమూలలకు చాటి చెప్పారన్నారు.



కోడి రామ్మూర్తి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పిస్తున్న వీరఘట్టం వాసులు

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

పాలకొండ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి, పశు సంవర్థక శాఖాధికారి మన్మథరావు హెచ్చరించారు. మండలంలోని కొండాపురం, గోపాలపురం తదితర గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కోడిపందేలు, గొర్రె పందేలు చట్టరీత్యా నేరమన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

సీతంపేట రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనుబాయి పరిసర గ్రామాలకు సోమవారం మద్యం తరలిస్తున్న వ్యానును పట్టుకున్నామని దోనుబాయి ఎస్ఐ మస్తాన్‌రావు తెలిపారు. బెల్టు షాపులకు మద్యం తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామని చెప్పారు. మొత్తం 503 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.70వేలు ఉంటుందని తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- కిందికి వేలాడుతున్న వైరం
- పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో ప్రజలు

కురుపాం, జనవరి13(ఆంధ్రజ్యోతి): కురుపాం ప్రధాన రహదారిలో విద్యుత్ వైర్లకు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కర్రల లోడుతో వెళుతున్న లారీకి ఈ విద్యుత్ తీగలు తగిలి పెను ప్రమాదం తప్పింది. ఈ వైర్లు లారీకి తగిలే సమయంలో నిప్పు రవ్వలు రాలి వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వైర్లు తెగి పడితే భారీ నష్టం సంభవించేది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే వైర్లు సరిచేయలని ప్రజలు కోరుతున్నారు.



లారీకి విద్యుత్ తీగలు తగిలిన దృశ్యం

విద్యుత్ చార్జీలను తగ్గించండి

- భోగి మంటల్లో బిల్లులు దహనం చేస్తూ నిరసన

ప్రభుత్వం తక్షణమే విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం భోగి మంటలో బిల్లు పేపర్లు దహనం చేశారు. పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఐ నాయకులు, వినియోగదారులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



బాడంగి: భీమవరంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేస్తున్న దృశ్యం



పాలకొండలో..



బొబ్బిలి రూరల్: ఎం.బూర్జవలసలో..

గ్రీవెన్స్‌కు 40 వినతులు

ఒడిశా

రాయగడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రామన్నగుడ సమితి సమావేశ మందిరంలో వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 40 వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించిన అదనపు కలెక్టర్.. వెంటనే వాటిని పరిష్కరించ వలసిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్య వైద్యాధికారి లాల్ మోహన్ రౌత్రాయ్, రామన్నగుడ సమితి అధ్యక్షుడు రబిశంకర్ గొమాంగ్, గుణుపూర్ ఆదివాసీ సంక్షేమ సాధన సమితి అధ్యక్షుడు అజయ్‌కుమార్ ప్రధాన్ అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.